క్లుప్తంగా

నల్ల బ్యాడ్జీలతో పీహెచ్‌సీ సిబ్బంది వైద్యులకు మద్దతు



వైద్యులకు మద్దతు తెలుపుతున్న పీహెచ్‌సీ సిబ్బంది

వేంపల్లె : రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి మండలంలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి మద్దతు తెలిపారు. మంగళవారం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తమ విధులను నిర్వర్తిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్యుల సమస్యలను, వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. వైద్యులు గ్రామీణ దూర ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులతో సేవలందిస్తున్నప్పటికీ వారికి సరైన గుర్తింపు, ప్రోత్సాహం లభించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వైద్యుల హక్కులను గౌరవించి ఆరోగ్య వ్యవస్థ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైద్యులు సులేమాన్, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీవున్నీషా బేగం, సూపర్‌వైజర్లు అంకయ్య, అరుణా దేవి, షేక్ ఫక్రుద్దీన్, సీహెచ్‌ఓ వెంకటరత్నం, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూమి రీ-సర్వేలో రైతులు సహకరించాలి



రీ-సర్వేపై సిబ్బందితో మాట్లాడుతున్న డీడీ, తదితరులు

ముద్దనూరు : భూముల రీ సర్వేలో రైతులు, అధికారులు పరస్పరం సహకరించుకుని భూమి హద్దులు నిర్ణయించాలని రీ-సర్వే ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి సూచించారు. మంగళవారం రీ-సర్వే ఫస్ట్-3లో భాగంగా డీడీ స్థానిక సిబ్బందితో కలసి రాఘవాపురం గ్రామంలో రీసర్వే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి హద్దులు నిర్ణయించేటప్పుడు రైతులకు తప్పకుండా సమాచారం ఇవ్వాలని, రైతుల సమక్షంలోనే రీసర్వే చేపట్టాలన్నారు. రైతులతో మాట్లాడి వారికి భూసర్వేపై అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని కొత్తపల్లె గ్రామ సచివాలయంలో కడప అసిస్టెంట్ డైరెక్టర్ మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ పుల్లయ్యలు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రీసర్వే సిబ్బంది, సర్వేయర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి

కమలాపురం : గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత తెలిపారు. మంగళవారం స్థానిక చదిపిరాళ్ల సెక్టార్ కోగటం-4 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా తల్లులు, గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అందుబాటులో ఉండే ఆకు కూరలు, కూరగాయలు తదితర ఆహార పదార్థాలతో వంటలు తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగేశ్వరీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, అరుణ, తల్లుల, గర్భిణు లు, బాలింతలు పాల్గొన్నారు.

ఐటీఐలో చేరితే జాబ్ గ్యారంటి

జమ్మలమడుగు : ప్రభుత్వ ఐటీఐలో చేరితే అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ నవరూప్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఐటీఐలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐటీఐ ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడం కోసం నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు, లేదా ఫెయిల్ అయిన వారు ఈనెల 16వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పదవ తరగతి ఉత్తీర్ణత, ఫెయిల్ అయిన ధృవీకరణ పత్రాలతోపాటు టీసీ, కుల ధృవీకరణ, ఆధార్‌కార్డు, ఫొటోలతో ఐటీఐ వద్దకు రావాలని సూచించారు.

నేడు వేలం పాట

వల్లూరు(చెన్నూరు) : చెన్నూరు మండల పరిధిలోని శివాలపల్లె వద్ద వెలసిన శ్రీ కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో తలనీలాల సేకరణ, కొబ్బరి కాయల విక్రయ హక్కుల కోసం ఆలయ ఆవరణలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కే శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. పాటకు ముందుగా తలనీలాల సేకరణ హక్కుకు రూ.50 వేలు, కొబ్బరి కాయల విక్రయ హక్కుకు రూ .50 వేలు డిపాజిట్ చెల్లించాల్సి వుంటుందన్నారు. వేలం ముగిసిన వెంటనే పాట దక్కించుకున్నవారు మొత్తాన్ని చెల్లించాలని, లేకుంటే వారు కట్టిన డిపాజిట్‌ను అపరాధ రుసుం కింద దేవస్థానానికి జమ చేయడంతో పాటు వేలం పాట తిరిగి నిర్వహించడం జరుగుతుందన్నారు. వేలం పాట దక్కించుకున్నవారు ఈ ఏడాది అక్టోబర్ 22వ తేదీ నుంచి 2026 సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఏడాది పాటు హక్కును పొందుతారన్నారు.

పడకేసిన పారిశుధ్య పనులు

- విజృంభిస్తున్న విష జ్వరాలు
- పట్టించుకోని అధికారులు



కాలువలో నిలిచిన మురికి నీరు

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా పారిశుధ్యం పడకేయడంతో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు జ్వరాలతో మంచాన పట్టారు. వారం రోజుల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, గొంతునొప్పి లక్షణాలతో ప్రజలు చేరుతున్నారు. గ్రామాల్లో రెండు మూడు రోజులకొకసారి కూడా వైద్య సిబ్బంది చికిత్సలు అందించేందుకు వెళ్లడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని పీహెచ్‌సీల్లో మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత వైద్యులు ఇంటి ముఖం పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పైడిపాలెం ఎత్తిపోతల పథకం కింద కొత్తకుమ్మరాంపల్లె పునరావాస కాలనీలో వారం రోజుల నుంచి విపరీతమైన దోమలతో కాలనీ వాసులు 60 నుంచి 70 మంది డెంగీ జ్వరాలతో బాధపడుతున్నారు. కాలనీలో మురుగునీరు బయటికి వెళ్లకపోవడంతో కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. కనీసం పారిశుధ్య పనుల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించి దోమలు బెడద లేకుండా చేసి కాలనీలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు.

రోగాల బారిన పడకుండా చూడాలి



మా కాలనీలో వర్షాలకు మురుగునీరు ప్రవహించకపోవడంతో ఇంటి ముందర మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. అధికారులు కాలనీ వైపు కన్నెత్తి చూడటం లేదు. అధికారుల స్పందించి కాలువల్లో మురికినీరు నిల్వ ఉండకుండా చూడాలి.

– నాగిరెడ్డి, కాలనీ వాసి, కుమ్మరాంపల్లె

మళ్లీ మొదలైన జ్వరాలు



కాలనీలో గత వారంలో విపరీతమైన జ్వరాలు రావడంతో చికిత్స అనంతరం జ్వరాలు తగ్గుముఖం పట్టాయి. కానీ వాతావరణం మారడంతో దోమలు విజృంభించి మళ్లీ జ్వరాలు ఎక్కువయ్యాయి. ఏ ఇంట్లో చూసిన జ్వరంతో బాధపడుతున్న వారే కనిపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– చంద్రశేఖర్ నాయక్, కాలనీ వాసి, కుమ్మరాంపల్లె

విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి



మామిడి పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కమలాపురం : రబీ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న అన్నదాతలు తప్పని సరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త సునీల్‌కుమార్, ఎంటమాలజిస్ట్, ఉద్యాన శాస్త్రవేత్త మానస తెలిపారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో రబీ సీజన్‌లో సాగు చేస్తున్న వేరుశనగ, మినుము, వరితో పాటు ఉద్యాన పంటలైన మామిడి, నేరేడు పంటలను వారు పరిశీలించి మాట్లాడారు. పంట సాగు చేయడానికి 24 గంటలు ముందు విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. మినుము లేక శనగ విత్తనాలు టెబుకోనజోల్ కిలో విత్తనానికి ఒక గ్రాము చొప్పున లేదా విటావాక్స్ పవర్ 1.5 గ్రాములు ఒక కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. కలుపు నివారణ కొరకు కలుపు మందులను సిఫారసు చేశారు. కాండం కుళ్లు తెగులును పరిశీలించి వీటి నివారణకు ఇమిగాకులోప్రిడ్ 80 గ్రాములు ఒక ఏకరాకు పిచికారి చేయాలన్నారు. జైశ్రీరామ్ రకం వరిని సాగు చేసుకునే రైతులు నవంబర్ మొదటి వారంలో నారు పోసుకోవాలని, డిసెంబర్‌లో ప్రధాన పొలంలో నాటుకోవాలని తెలిపారు. ఏఓ సరస్వతి మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ జారీ చేసిన లైసెన్సు కలిగిన ఆధీకృత డీలర్ల వద్ద నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రసీదుల్లో విత్తనానికి సంబంధించిన పంట రకము, లాట్ నెంబర్, పరిమాణం, చెల్లించవలసిన రుసుము వివరాలను తనిఖీ చేసుకోవాలన్నారు. పంట కాలం పూర్తయ్యేంత వరకు కొనుగోలు రసీదులను భద్ర పరచుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ సురేఖ, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల మేరకే ఎరువులను వినియోగించాలి

ముద్దనూరు : భూసార పరీక్షలు ఫలితాల ఆధారంగానే రైతులు తమ పొలాల్లో ఎరువులను వినియోగించాలని డీఆర్‌సీ ఇన్‌చార్జి డీడీఏ నాగరాజు సూచించారు. మంగళవారం మండలంలోని పెనికలపాడు గ్రామంలో భూసార పరీక్షలు, భూసార పరిరక్షణపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు తప్పకుండా విత్తనం వేసేటప్పుడు విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. అధికారులు మట్టి నమూనాల వలన కలిగే ప్రయోజనాలు, పోషకాలు ఎంతమేర వున్నాయి, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే మార్గాలను సూచించారు. కార్యక్రమంలో రైతులకు భూసార పరీక్షా ఫలితాల పత్రాలను అందించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏవోలు పద్మజ, సుచిత్ర, స్థానిక ఏవో వెంకటకృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన జంటను ఆశీర్వదిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : గతనెలలో పులివెందులలో 21వ వార్డు కౌన్సిలర్ సోకే వెంకటరమణ (కోడి రమణ) కుమారుడు వంశీ వివాహం శోభకళతో జరిగింది. అప్పట్లో వివాహానికి హాజరుకాలేకపోయిన ఎంపీ మంగళవారం కోడి రమణ నివాసానికి చేరుకుని నూతన జంటను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పరామర్శ



గాయపడిన హోలు గంగాధరరెడ్డి, గంగిరెడ్డిలను పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

రెండు రోజుల క్రితం పులివెందుల వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హోలు గంగాధరరెడ్డి, ఆయన సోదరుడు గంగిరెడ్డిలు వేముల మండలం గొందిపల్లె వద్ద కారు ప్రమాదంలో గాయపడ్డారు. వారిని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హోలు గంగాధరరెడ్డి స్వగృహానికి చేరుకుని అన్నదమ్ములను పరామర్శించి ప్రమాద సంఘటన విషయాలను తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

విద్యార్థులలో మేథోశక్తిని పెంపొందిస్తాయి

పులివెందుల టౌన్ : చెకుముకి పరీక్షలు విద్యార్థులలో మేథోశక్తిని పెంపొందిస్తాయని పాఠశాల హెడ్మాస్టర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో ఆయన చెకుముకి పరీక్షల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 18వ తేదీన పాఠశాలస్థాయిలో జరిగే చెకుముకి పరీక్షలలో విద్యార్థులందరూ పాల్గొనాలన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను మండలస్థాయికి ఎంపిక చేసి పంపే బాధ్యతను పాఠశాల యాజమాన్యం చూస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా శక్తిని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక ప్రోత్సాహం ఇస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాంరెడ్డి, బాలబయన్నలు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి గోడ పత్రికలను వారు ఆవిష్కరించి మాట్లాడారు.



చెకుముకి పరీక్షల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హెడ్మాస్టర్, జేవీవీ నాయకులు

వేములలో..

వేముల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్ట్ గోడ పత్రాలను హెడ్మాస్టర్ నాగిరెడ్డి, జేవీవీ నాయకులు శివరాం, బాలబయన్నలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెకుముకి సైన్స్ పరీక్షలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10 తరగతుల విద్యార్థులకు శాస్త్రీయ అవగాహనను పెంచడానికి, మేథోశక్తిని ప్రోత్సహించడానికి రూపొందించడం జరిగిందన్నారు. ఈనెల 18న పాఠశాల స్థాయిలో జరిగే పరీక్షలలో విద్యార్థులు తప్పకుండా పాల్గొనాలన్నారు.

సీపీఆర్ మీద అవగాహన ఉండాలి

వేంపల్లె : సీపీఆర్ మీద అవగాహన కలిగి ఉండటం ఆవశ్యకమని కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర తెలిపారు. మంగళవారం సీపీఆర్ వారోత్సవ సందర్భంగా స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాళ్లపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సహకారంతో, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో సీపీఆర్ మీద అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓ దేవి మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లు, ప్రకృతిలో కలిగే మార్పులు, సరైన వ్యాయామం లేకపోవటంవలన ఎక్కువమంది గుండెపోటుకు గురవుతున్నారని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుండెపోటు వచ్చినప్పుడు వెంటనే సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చునన్నారు. అదేవిధంగా సీపీఆర్ విధానాన్ని విపులంగా వివరించి, విద్యార్థుల చేత చేయించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఓబుల్ రెడ్డి, మల్లేశ్వరమ్మ అధ్యాపకులు శ్రీకాంత్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎర్రగుంట్లలో సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని రాణీవనంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అర్బన్ హెల్త్ కేంద్రం వైద్యాధికారి శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలు కాపాడవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూటమికి పట్టని రైతు గోడు

ఎర్రగుంట్ల : కుటమి ప్రభుత్వానికి రైతు గోడు పట్టడంలేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నదండ్లూరు, ఇల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలలో దెబ్బతిన్న వరి పంటను వైఎస్సార్‌సీపీ వ్యవసాయ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మేకల వీరభాస్కర్‌రెడ్డితో కలసి ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షాతో దెబ్బతిన్న పంటలను ఏ ఒక్క అధికారి కూడా పరిశీలించిన పాపాన పోలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, రుణాలు వచ్చాయన్నారు. రైతులకు నష్టపరిహారం అందించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వానికి ఉందన్నారు. రైతుకు ఈ ప్రభుత్వం ఏమి చేయలేదన్నారు. బీజేపీ పాలన ఉన్న రాష్ట్రాలలో రైతులకు యూరియాను సకాలంలో అందించారు. బీజేపీతో పొత్తు ఉన్న మన రాష్ట్రంలో రైతులను ఆదుకోలేదని ఆరోపించారు. రైతు రోడ్డున పడితే మీ భవిష్యత్తు ఉండదన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ జేడీ స్పందించి ఈ రెండు గ్రామాలలో పర్యటించి రైతులకు నష్టపరిహారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, రైతులు ఈశ్వరరెడ్డి, రమణారెడ్డి, సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు నరపురెడ్డి దస్తగిరెడ్డిలు పాల్గొన్నారు.



దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

బాలికలు అన్ని రంగాలలో ముందుండాలి

పులివెందుల టౌన్ : బాలికలు అన్ని రంగాలలో ముందంజలో ఉండాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఆర్.ప్రసన్నలత పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధి బ్రాహ్మణపల్లెలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మీద పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలపై లింగ వివక్ష చూపరాదని, సేవ్ గర్ల్ చైల్డ్ భావనతో ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని, బాలికల, బాలుర నిష్పత్తి సమానగా ఉండేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ మార్తమ్మ, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : ఆడ మగ ఇద్దరూ సమానమేనని, ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ కాదని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీవున్నీషా బేగం తెలిపారు. మంగళవారం తాళ్లపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లింగ సమానత్వం, సేవ్ గర్ల్ చైల్డ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భ్రూణ హత్యలు, గర్భస్థ పిండం లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్న వారికి రూ.10వేల నుండి లక్ష రూపాయల వరకు జరిమానాతోపాటు జైలు శిక్ష విధించబడుతుందన్నారు.



పులివెందులలో మాట్లాడుతున్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఆర్.ప్రసన్నలత

అంతేకాకుండా లింగ నిర్ధారణ చేయించుకోమని ప్రోత్సహించిన వారికి కూడా మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధించబడుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటరత్నం, హెచ్‌ఎం రవికుమార్, పి.డి.సాంబశివయ్య, సూపర్‌వైజర్లు అంకయ్య, అరుణాదేవి, ఏఎన్‌ఎంలు , ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వల్లూరులో

వల్లూరులో : ప్రతి ఒక్కరూ లింగ వివక్షతను పూర్తిగా రూపుమాపడానికి కృషి చేయాల్సిన అవసరం వుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మాస్ మీడియా అధికారి భారతి అన్నారు. గంగాయపల్లెలో వున్న ఏపీ మోడల్ స్కూల్ కమ్ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం వివిధ అంశాలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. అనంతరం బేటీ బచావో – బేటీ పడావో, ఫోక్స్ చట్టం, విద్యా హక్కు చట్టం, మహిళా సాధికారత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఏ వెంగల్‌రెడ్డి, జయ ప్రకాష్, లీగల్ అధికారి పాలేశ్వర రావు, ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



వేంపల్లెలో మాట్లాడుతున్న డిప్యూటీ హెల్త్ కమిషన్ ఆఫీసర్ షఫివున్నీషా బేగం

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండలంలోని చిలంకూరు గ్రామం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ బాలిక దినోత్సవ వారోత్సవాలు సందర్భంగా బేటీ బచావో బేటి పడావో కార్యాక్రమాన్ని నిర్వహించినట్లు చిలంకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టరు వంశీకల్యాణ్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ బుడ్డ శనగల పంపిణీలో కూటమి విఫలం

పులివెందుల టౌన్ : రైతులకు సబ్సిడీ బుడ్డ శనగల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీవీ శశికాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రబీ సీజన్ మొదలై రైతులు తమ వ్యవసాయ పొలాల్లో ఎరువులు విత్తడం జరిగిందని, కానీ ఇప్పటివరకు వ్యవసాయ అధికారులు రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీ బుడ్డశనగలు ఇంతవరకు ఇవ్వడంలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో విత్తనాలు పంపిణీ చేసి రైతులకు అండగా నిలిచారన్నారు. గత ప్రభుత్వంలో 40 శాతం రాయితీతో సబ్సిడీ విత్తనాలు ఇచ్చారని, కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 40 శాతం రాయితీని 25 శాతానికి తగ్గించినప్పటికీ విత్తనాలు సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఒక క్వింటా శనగల ధర రూ.6వేలు ఉన్నాయని, కానీ ప్రభుత్వం ఇచ్చే ధర రూ.5850లు అంటే కేవలం ఒక కేజీకి రూ.150లు మాత్రమే తేడా ఉందన్నారు. అయినా అందుబాటులో శనగ విత్తనాలు లేకపోవడం వలన ప్రైవేటు వ్యాపారస్తులను ప్రోత్సహిస్తున్నట్లు అనిపిస్తుందన్నారు. యూరియాను కూడా రైతులకు సకాలంలో ప్రభుత్వం అందించలేకపోయిందన్నారు. వెంటనే సంబంధిత అధికారులు రాయితీ కింద శనగ విత్తనాలను రైతులకు సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పోరాటం మరింత ఉధృతం చేస్తాం



ఆర్టీపీపీలో మెయిన్ గేటు వద్ద వర్కుటు రూల్ కార్యక్రమం చేపడుతున్న జేఏసీ

ఎర్రగుంట్ల : విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన కోరికలు తీరే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం ఆర్టీపీపీలోని జేఏసీ ఆధ్వర్యంలో పవర్ హౌస్ గేటు వద్ద వర్క్ టు రూల్ కార్యక్రమాన్ని పాటించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ యాజమన్యం మొండి వైఖరి విడి కార్మిక సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలి డిమాండ్ చేశారు. యజమాన్యంతో రెండు సార్లు జేఏసీ నాయకులు చర్చలు జరిపినా.. ఏ సమస్యపైనా సానుకూల స్పందన ఇవ్వలేదని జేఏసీ పేర్కొంది. దీంతో 15వ తేదీ బుధవారం ఉదయం నుంచి నిరవధిక సమ్మెకు పోతున్నట్లు తెలిపారు.

కబ్జాదారుడు సూచిక బోర్డును పీకేశాడు



అధికారులు నాటుతున్న సూచిక బోర్డు (ఫైల్)

వేంపల్లె : మండలంలోని 2 కిలోమీటర్ల దూరంలో ఉండే పాములూరు గ్రామ రెవెన్యూ పంచాయతీ పరిధిలో 513 సర్వేనెంబర్‌లో ప్రభుత్వ భూమి అని రెవెన్యూ అధికారులు సూచిక బోర్డు నాటారు. అయితే నేడు మంగళవారం కబ్జాదారుడు బోర్డును పీకేశారు. పాములూరు పంచాయతీ పరిధిలో 518 సర్వేనెంబర్‌లో సుమారు 8 ఎకరాలు వేంపల్లె కాపు వీధికి చెందిన టీడీపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి అనే వ్యక్తి ఆక్రమణ చేసి పత్తి పంటను సాగు చేశారు. అయితే ఆ గ్రామస్తులు గ్రామదర్శినిలో వేంపల్లె తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులకు పలు సందర్భాల్లో ఫిర్యాదు చేసిన నిర్లక్ష్యం వహిస్తూ పట్టించుకోవడంలేదని మూడు రోజుల క్రితం కలెక్టర్ చెరుకూరు శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. తాను అధికార పార్టీ నేతను అని చెప్పుకుంటూ అధికారులను బెదిరిస్తున్నారు. అక్కడ పనిచేస్తున్న దళిత విఆర్‌ఓ అని కూడా బెదిరిస్తూ కబ్జాకు సహకరించాలని హుకుం జారీ చేశారు. వేంపల్లె తహసీల్దార్, పులివెందుల ఆర్డీవో, కలెక్టర్‌లకు పలువురు ప్రజా సంఘ నాయకులు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించడం లేదు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలమని సూచిక బోర్డును పెట్టినా లెక్కచేయకుండా సూచిక బోర్డును కబ్జాదారుడు పీకి పడేశాడు. టీడీపీ నాయకులు అండ చూసుకుని రోజు రోజుకు రెచ్చిపోతున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుండి కాపాడి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని పజా సంఘాలు కోరుతున్నాయి.

దోమల నియంత్రణ మనందరి బాధ్యత

సింహాద్రిపురం : దోమల నియంత్రణ మనందరి బాధ్యత అని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని పైడిపాలెం గ్రామంలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే విస్తృతంగా నిర్వహించారు. సర్వే సందర్భంగా ఆయన ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులలో ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నారా అనే విషయాన్ని విచారి మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుకుమార్, సీహెచ్‌ఓ పవిత్ర, ఆరోగ్య కార్యకర్త నాగలక్ష్మీ, ఆశా కార్యకర్త ఉమ, తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రంలో రికార్డుల పరిశీలన

లింగాల : స్థానిక రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం వ్యవసాయ శాఖ జేడీ చంద్ర నాయక్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. అలాగే వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందుతున్న సేవల గురించి ఆరా తీస్తూ శనగ పంట సాగు చేసే రైతులకు డీఏపీ ఎరువును పంపిణీ చేశారు. అనంతరం జేడీఏ శనగ పంట సాగు చేసే రైతులకు రానున్న రెండు రోజులలో విత్తన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తామని, నమోదు చేసుకునే రైతులు డబ్బులు ఆన్‌లైన్ క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి మాత్రమే చెల్లించాలన్నారు. శనగ పంట ఈనెల చివరి వరకు విత్తనం వేసుకోవచ్చునని రైతులకు తెలియచేశారు. అదేవిధంగా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంట కూడా ఈ క్రాప్ బుకింగ్ చేయాలని, అలాగే బీడు భూములు కూడా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ల్యాండ్ పార్సిల్ కూడా బుక్ చేయాలని, ఈ నెల 25వ తేదీలోగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ పంట నమోదు ఆధారంగానే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, సున్నా వడ్డీ పంట రుణాలు, మద్దతు ధర వంటి ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రమేష్ , రైతు సేవా కేంద్ర సిబ్బంది రాణి, రైతులు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : రబీ సీజన్‌లో సాగు చేసే రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలు నాణ్యతంగా ఉండాలని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు బి.చంద్రనాయక్ తెలిపారు. మంగళవారం కొండాపురంలోని శ్రీ వెంకటేశ్వర ఆగ్రోటెక్, ఓబన్నపేటలోని శ్రీ బాలజీ ఆగ్రోటెక్ శనగ విత్తన ప్రాసెసింగ్ సెంటర్లను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల శనగ విత్తనాల రిజిస్ట్రేషన్ ఆలస్యమైందన్నారు. రెండు మూడు రోజుల్లో గ్రామాల్లోని ఆయా రైతు సేవాకేంద్రాల్లో శనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. శనగ విత్తన ప్రాసెసింగ్ సెంటర్లలో శనగలను నాణ్యతను ఆయన పరిశీలించి అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. లావనూరు గ్రామంలో పొలాల్లో సాగు చేసే పంటలు తప్పనిసరిగా ఇ పంట నమోదు ఈనెల 25వ తేదిలోపల చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రామమోహన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఏవీ రామంజులరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



రైతు సేవా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న జేడీఏ చంద్ర నాయక్